

కలగానే క్రమబద్ధీకరణ

వైద్యారోగ్య శాఖలో 16 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. 8లో



బీఎస్ఎన్ఎల్‌లో మెరుగైన సేవలు

ప్రైవేట్ నెట్‌వర్క్‌లకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలందిస్తోందని, వినియోగదారులు ఆదరించాలని ఏజీఎం సుభాష్ కోరారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం కొన్ని చోట్ల చిరు జల్లులు పడతాయి.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు అనుమతి తప్పనిసరి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి భాస్కర్



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి భాస్కర్

కొత్తగూడెం రూరల్: ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాలు, ఆస్పత్రులు తప్పకుండా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. కొత్తగూడెంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పట్టణంలోని శ్రీ అమృత దీప ఆర్థోపెడిక్ ఆస్పత్రికి అనుమతి లేదని గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయుష్, అల్లోపతి, నేచురోపతి, యునాని, ఫిజియోథెరపీ, ఇతర అన్ని రకాల ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మధురం, డిప్యూటీ డెమో ఫైజ్ మొహియిద్దీన్ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌వి దిగజారుడు మాటలు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజాపాలన పేరుతో రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. గౌరవప్రదమైన అసెంబ్లీని కౌరవ సభగా మార్చేశారని విమర్శించారు. అసలుసిసలు కాంగ్రెస్ వాదైన వైఎస్. రాజశేఖరరెడ్డి.. సబితా ఇంద్రారెడ్డిని చెల్లెమ్మలా గౌరవిస్తే, నకిలీ కాంగ్రెస్ నాయకుడైన రేవంత్ రెడ్డి అగౌరవపరిచి, అవమానిస్తున్నాడని అన్నారు. అసెంబ్లీ గౌరవాన్ని తగ్గిస్తున్నారని, తన స్థాయికి తగ్గట్టుగా మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్ష పూరితంగా వ్యవహరించి సబితా ఇంద్రారెడ్డిని మనోవేదనకు గురి చేశారని, మహిళలను అవమానపరచడమే కాంగ్రెస్ పార్టీ విధానమా అని ప్రశ్నించారు. సబిత శాపం తగిలి రేవంత్ రెడ్డి పదవి పోవటం ఖాయమన్నారు. ఆమెకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి



రిటైర్డ్ ఎస్సైలు, కుటుంబసభ్యులతో ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: ఇంతకాలం పోలీసు శాఖలో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన వారు విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. కొత్తగూడెం త్రీటౌన్ ఎస్సై ఖాజా నజీరుద్దీన్, షీటీం ఎస్సై శ్రీనివాసరావు బుధవారం ఉద్యోగ విరమణ పొందగా వారిని ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ అన్నీ త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు కార్యాలయ అధికారులకు సూచించారు. అనంతరం ఇద్దరు ఎస్సైలకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత్‌కుమార్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, షీటీం ఎస్సై పి.రమాదేవి పాల్గొన్నారు.

కరకట్టకు ముప్పే!

భద్రాచలానికి తప్పని మురుగునీటి సమస్య

- మోటార్ల ద్వారా గోదావరిలోకి ఎత్తిపోస్తున్న అధికారులు
- తూము దగ్గర దెబ్బతింటున్నా పట్టని వైనం
- మరికొన్నాళ్లు ఎత్తిపోస్తే ప్రమాదమే..



మోటార్లతో ఎత్తి పోస్తుండడంతో కరకట్ట రాళ్లపైనే పడుతున్న వరద నీరు

భద్రాచలం అర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మించిన కరకట్ట నిర్వహణలో ఇరిగేషన్ శాఖ కనబరుస్తున్న నిర్లక్ష్య వైఖరి విమర్శలకు తావిస్తోంది. అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గండి ఘటన నుంచి ఆ శాఖ అధికారులు ఎలాంటి పాఠాలు నేర్వలేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

స్లూయిస్‌ల మూసివేత..

గోదావరి నది నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంతో పాటు భద్రాచలం పట్టణానికి రక్షణ కల్పించే లక్ష్యంతో 2002లో తీరం వెంట 80 అడుగుల ఎత్తుతో కరకట్ట నిర్మించారు. ఆ తర్వాత గోదావరికి పలుమార్లు వరద పోటెత్తినా 1986 తరహాలో వరద నీరు ఆలయ ప్రాంగణం వైపునకు రాకుండా అడ్డుకట్ట పడింది. భద్రాచలం పట్టణం నుంచి వెలువడే మురుగునీరు గోదావరిలో కలిసేలా కరకట్ట వెంట రాఘవ నిలయం వెనక, విస్తా కాంప్లెక్స్, సుభాష్‌నగర్, ఏఎంసీ కాలనీల దగ్గర స్లూయిస్‌లు (తూములు) ఏర్పాటు చేశారు. గోదావరి నదిలో వరద నీరు 30 అడుగుల కంటే తక్కువగా ఉన్నప్పుడు ఈ స్లూయిస్ గేట్లు ఎత్తి ఉంచుతారు. అప్పుడు పట్టణంలో వెలువడే మురుగు నీరు, వర్షం కారణంగా వచ్చే వరద ఈ గేట్ల ద్వారా ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. కానీ గోదావరిలో వరద నీటి మట్టం 30 అడుగులకు మించితే స్లూయిస్ గేట్ల ద్వారా నదిలోని నీరు పట్టణంలోకి వచ్చే ప్రమాదం ఉండడంతో వాటిని మూసేస్తారు.

మోటార్లతో ఎత్తిపోతలు..

వానాకాలంలో గోదావరికి వరదలు వచ్చినప్పుడు స్లూయిస్ గేట్లను కనీసం నెల రోజుల పాటు మూసి ఉంచాల్సి వస్తోంది. ఈ సమయంలో పట్టణం నుంచి వచ్చే మురుగు, వర్షం నీరు కరకట్ట దగ్గర చేరి మడుగులా మారుతోంది. దీనికి స్లూయిస్‌ల్లోని లీకుల కారణంగా వచ్చే గోదావరి వరద తోడవడంతో సమీపంలోని జనావాసాలు, ఆలయం దగ్గర విస్తా కాంప్లెక్స్ ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఇక్కడ ప్రత్యేకంగా పదుల సంఖ్యలో మోటార్లు ఏర్పాటు చేసి ఆ నీటిని తోడి గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఈ ఎత్తిపోతలకు రూ.38 లక్షలు ఖర్చు చేశారు.

దెబ్బతింటున్న కరకట్ట

రాఘవ నిలయం, ఏఎంసీ కాలనీ, సుభాష్‌కాలనీ, విస్తా కాంప్లెక్స్ దగ్గర నిలిచిన నీటిని మోటార్ల ద్వారా ఎత్తి గోదావరిలో పోస్తారు. అయితే ఈ నీరు నేరుగా గోదావరిలో పడేలా పైపులు ఏర్పాటు చేయడం లేదు. కరకట్ట పై భాగం నుంచి కొంత మేరకు కింద వరకు పైపులు ఏర్పాటు చేసి ఎత్తి పోస్తున్నారు. దీంతో మోటార్ల ద్వారా పడుతున్న నీటి ప్రవాహ వేగానికి కరకట్ట పటిష్టత దెబ్బ తింటోంది. గత పదేళ్లుగా ఇదే తీరున ఎత్తిపోతల కారణంగా కరకట్టకు నాలుగైదు చోట్ల సుమారు 70 అడుగుల ఎత్తులో రివిట్‌మెంట్ రాళ్లు చెల్లాచెదురయ్యాయి. గత రెండు వారాలుగా వరద నిలకడగా ఉన్నప్పటికీ 54 అడుగుల మించి రాలేదు. కానీ 2022 తరహాలో 71 అడుగుల స్థాయిలో వరద వస్తే కరకట్ట ఎంత మేరకు తట్టుకుంటుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మూణ్నాళ్ల ముచ్చటే..



బ్రిడ్జి పై భాగంలో మెలితిరిగిన ఇనుప చువ్వలు

- పది రోజుల్లోనే కుంగిన ఇనుప వంతెన
- రూ.13 లక్షల నిధులు వరద పాలు
- ఆదివాసీలకు తప్పని దారి తిప్పలు



వాగులోకి దిగిపోయిన వంతెన మధ్య పిల్లర్

ములకలపల్లి: ములకలపల్లి – తాళ్లపాయ గ్రామాల మధ్య పాములేరు వాగుపై నిర్మించిన ఇనుప వంతెన పది రోజులకే కుంగిపోయింది. భారీ వర్షానికి బ్రిడ్జి మధ్యలో ఏర్పాటు చేసిన ఐరన్ చానల్ ఇసుకలోకి కొంతమేర దిగింది. వంతెన పై భాగంలో అమర్చిన ఇనుప చువ్వలు దగ్గరకు ఒత్తుకొని, మెలితిరిగి పోయాయి.

11 టన్నుల ఐరన్‌తో ..

పాములేరు వాగుపై బ్రిడ్జి నిర్మిస్తున్న క్రమంలో డైవర్షన్ రోడ్డు వేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఆ రోడ్డు తెగిపోవడంతో రూ.13 లక్షల వ్యయంతో నాలుగు అడుగుల వెడల్పు, 120 అడుగుల పొడవున వాగుపై ఐరన్ బ్రిడ్జి నిర్మించారు. ఇందుకు 11 టన్నుల ఐరన్ వినియోగించగా, వారం రోజుల పాటు పనులు చేశారు. దీనిపై నుంచి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేలా ఏర్పాట్లు చేశారు. అయితే ప్రారంభించి పది రోజులు కాకముందే వంతెన మరమ్మతులకు గురైంది. భారీ వర్షాలతో బ్రిడ్జి మధ్య భాగంలోని సపోర్ట్ ఐరన్ రాడ్‌లు ప్రవాహ ఉధృతితో కొంతమేర వాగులోకి దిగిపోయాయి. దీంతో వంతెన మధ్య భాగం కుంగిపోగా పైన రాడ్‌లు వంగిపోయాయి. పలుచోట్ల వెల్డింగ్ ఊడడంతో అది తీగల వంతెనను తలపిస్తోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిపేశారు. ప్రస్తుతానికి పాదచారులు మాత్రమే వెళ్లేలా వెసులుబాటు కల్పించారు. దీంతో తాళ్లపాయ, రింగిరెడ్డిపల్లి, బూర్గ కొయ్యగుంపు, మధ్యగుంపు, మంగళిగుట్ట, సుందర్‌నగర్ గ్రామాల ప్రజలకు రాకపోకలు ఇబ్బందిగా మారాయి.

నాణ్యత లోపం వల్లే..



వంతెన నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం వల్లే కుంగిపోయింది. మొదట్లో డైవర్షన్ రోడ్డు తెగిపోయింది. ఇప్పుడు ఇనుప వంతెనపై కూడా బైక్‌లు వెళ్లే అవకాశం లేదు. అత్యవసర పరిస్థితుల్లో చాలా ఇబ్బంది పడుతున్నాం.

– గడ్డం రమణబాబు, తాళ్లపాయ

అధికారుల అలసత్వమే కారణం



అధికారుల అలసత్వం వల్ల ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇసుప వంతెన కుంగిపోవడంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సత్వర చర్యలు తీసుకుని ప్రజల కష్టాలు తొలగించాలి.

– నరాటి ప్రసాద్, సీపీఐ నాయకుడు

అనూహ్యంగా వరద రావడంతోనే..



వాగులో అనూహ్యంగా వరద రావడంతో వంతెన మధ్య పిల్లర్ చానల్ కుంగిపోయింది. నీళ్లలో పెద్దపెద్ద మొద్దులు కొట్టుకొచ్చి డైవర్షన్ రోడ్డు మోరీలకు అడ్డుపడ్డాయి. దీంతో ప్రవాహ ఉధృతికి మధ్య పిల్లర్ దిగువ భాగంలో ఇసుక కోతకు గురైంది. వరద తగ్గగానే మరమ్మతులు చేస్తాం.

– సుబ్బరాజు, ఐటీడీఏ ఏఈ

నిలకడగా గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం అర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు 44.2 అడుగులు ఉన్న గోదావరి స్వల్పంగా పెరిగి మధ్యాహ్నం 12 గంటలకు 45 అడుగులకు చేరింది. సాయంత్రం వరకూ అలాగే స్థిరంగా ఉంది. రాత్రి 11గంటలకు 44.40 అడుగులకు చేరింది. 43 అడుగులకు పైగానే నీటిమట్టం ఉండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. కాగా అశోక్‌నగర్ కాలనీకి చెందిన 44 కుటుంబాలు, ఏఎంసీ కాలనీకి చెందిన 10 కుటుంబాల వారు ఇంకా పునరావాస శిబిరంలోనే ఉన్నారు. ఇతర కాలనీల వాసులు తిరిగి వెళ్లిపోయారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్, శానిటేషన్ పనులు చేపడుతున్నారు.

భద్రగిరిలో ఇక రామనామం

దాత సాయంతో త్వరలో ప్రారంభం

భద్రాచలం: భద్రాచలం రామాలయ పరిసర ప్రాంతాల్లో ఇక నిత్యం రామనామం, కీర్తనలు వినిపించనున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి భద్రాచలానికి తరలి వస్తుంటారు. పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు, భక్తులను అలరించేలా మైక్‌ల ఏర్పాటుకు హైదరాబాద్‌లోని ఓ దాతను ఆశ్రయించగా రూ. 4 లక్షలు వితరణగా అందజేసేందుకు ముందుకొచ్చారు. రామాలయం నుంచి తాతగుడి సెంటర్ వరకు, అలాగే రామాలయం నుంచి అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎంట్రన్స్ వరకు మైక్‌లు ఏర్పాటు చేయనున్నారు. మరో 20 రోజుల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయని ఆలయ ఈఓ ఎల్. రమాదేవి తెలిపారు.

‘సీతారామ’ ట్రయల్ రన్ వాయిదా

ములకలపల్లి: మండలంలోని వీకే. రామవరంలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్–2 మోటార్ల ట్రయల్ రన్ ప్రక్రి య వాయిదా పడింది. ఇక్కడి ఆరు పంపులకు ట్రయల్ రన్ చేపడుతున్నట్లు బుధవారం ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పలువురు ప్రాజెక్ట్ వద్ద మధ్యాహ్నం నుంచి వేచి చూడగా రాత్రి 9:30 గంటలకు పంప్‌లు ప్రారంభిస్తారనే అనధికారిక సమాచారం అందింది. కాగా పనులు పూర్తి కాకపోవడంతో ఈ ప్రక్రియ వాయిదా పడిందని తెలియడంతో అక్కడి నుండి నిష్క్రమించారు.

ప్రజలను అప్రమత్తం చేస్తుండాలి

ఫ్లడ్ కంట్రోల్ రూమ్ పరిశీలనలో కలెక్టర్



కంట్రోల్ రూమ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరద ప్రవాహ వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన గోదావరి వరదల కంట్రోల్ రూమ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదునూ వెంటనే పరిష్కరించాలని, ఈ మేరకు సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

హరితవనాల పరిశీలన..

కొత్తగూడెం రూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రశాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని మోడల్ మరుగుదొడ్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఆ తర్వాత రేగళ్ల, బావోజీ తండాలో హరిత వనాలను సందర్శించి మొక్కలు నాటారు. మైలారం పంచాయతీలో మునగ ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు.

గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



లాటరీ ప్రక్రియను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించేలా కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన పీఓ మాట్లాడుతూ.. ఆరో తరగతిలో రెండు సీట్లకు ఎరుకల కులం వారిని, 8వ తరగతిలో 8 మంది లంబాడీ బాలురను ఎంపిక చేశామని తెలిపారు. అలాగే, ఆరు, ఎనిమిది, తొమ్మిదో తరగతులకు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ఐదుగురిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు ఉన్నందున సీట్లు పొందిన విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఖమ్మం డీఈ విజయలక్ష్మి, అధికారులు రాజశేఖర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫౌంటెయిన్ కాదిది..



భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో ఫౌంటెయిన్‌ను మరిపించేలా నీరు పైకి ఎగిసిపడుతుండడంతో అందరూ ఆసక్తిగా తిలకించారు. సెల్‌ఫోన్లలో వీడియోలు తీయడంతో పాటు పలువురు సెల్ఫీలు దిగారు. విషయం తెలుసుకున్న భగీరథ అధికారులు ఢీకొట్టిన లారీ యజమానితోనే మరమ్మతు పనులు చేయిస్తున్నారు.

– భద్రాచలంఅర్బన్

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు

- ప్రస్తుత రిజిస్ట్రార్ అశోక్ హైదరాబాద్‌కు...
- ఉమ్మడి జిల్లాలో పలువురు సబ్ రిజిస్ట్రార్లకూ స్థానచలనం



ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ చిట్టిమళ్ల అశోక్‌కుమార్‌ను హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేయగా.. ఆయన స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ రావును కేటాయించారు. ఇక ఉమ్మడి జిల్లాలోని ఒకరిద్దరు సబ్ రిజిస్ట్రార్లు మినహా మిగతా వారిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించగా.. అక్కడి అధికారులను ఖమ్మం బదిలీ చేశారు. ఖమ్మం మార్కెట్ వ్యాల్యూ(ఎంవీ) అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ అడపా రవీంద్రబాబును మహబూబాబాద్‌కు, కూసుమంచి సబ్‌రిజిస్ట్రార్ జె.రామనర్సింహారావును వరంగల్ రిజిస్ట్రార్ కార్యాలయం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1గా బదిలీ చేశారు. కొత్తగూడెం సబ్‌రిజిస్ట్రార్ జి.రాంకుమార్ వరంగల్ డీఐజీ కార్యాలయం సూపరింటెండెంట్‌గా, ఇల్లెందు సబ్‌రిజిస్ట్రార్ బి.సైదులును వరంగల్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి, ఖమ్మం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–1 ఎ.విజయజ్యోతి ఖమ్మం మార్కెట్ వ్యాల్యూ అండ్ ఆడిట్‌కు, ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 ఎస్.పద్మ కూసుమంచి సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఇక ఖమ్మం ఎం.వీ. అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ డి.సృజన్‌కుమార్‌ను పరకాల సబ్ రిజిస్ట్రార్‌గా, ఖమ్మం అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్ పి.యామినిని వరంగల్ అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా, మధిర ఎస్ఆర్ఓ ఏ.గిరిధర్‌ను నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, ఖమ్మం రూరల్ ఎస్ఆర్ఓ జి.నరేంద్రను వరంగల్ ఫోర్ట్ సబ్ రిజిస్ట్రార్‌గా, కల్లూరు ఎస్ఆర్ఓ డి.ఆనంద్‌ను వరంగల్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–2గా, సత్తుపల్లి ఎస్ఆర్ఓ వి.ప్రభాకర్‌రావును వర్ధన్నపేట సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

జిల్లాకు ఎవరెవరంటే..

జనగామ ఎస్ఆర్ఓగా విధులు నిర్వర్తిస్తున్న టి.సంపత్‌కుమార్ ఖమ్మం ఆర్ఓ కార్యాలయ జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1గా, నిజామాబాద్ ఆర్ఓ కార్యాలయం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1 బి.రామచంద్రయ్య వైరా ఎస్ఆర్ఓగా, వరంగల్ ఆర్ఓ కార్యాలయ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–2 ఆర్.రాజు మధిర సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై రానున్నారు. వరంగల్ ఎం.వీ. అండ్ ఆడిట్ కె.మోసెస్ భాస్కర్ సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా, వరంగల్ అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్ వి.వేణుమాధవ్‌ను కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్‌గా, వరంగల్ ఫోర్ట్ ఎస్ఆర్ఓ ఏ.కార్తిక్‌ను ఖమ్మం అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా, భీమదేవరపల్లి ఎస్ఆర్ఓ టి.భాగ్యలక్ష్మిని ఖమ్మం ఎం.వీ. అండ్ ఆడిట్‌కు కేటాయించారు. ఇంకా వరంగల్ రూరల్ ఎస్ఆర్ఓ ఎం.డీ.ఖాజా మసీయుద్దీన్ కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా, నర్సంపేట ఎస్ఆర్ఓ ఎస్.రామ్‌కిషోర్ రెడ్డి ఖమ్మం ఆర్ఓ జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2గా, వర్ధన్నపేట ఎస్ఆర్ఓ జె.అరుణ ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై రానున్నారు.

ఫిజికల్ డైరెక్టర్లు...

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాలోని మూడు డిగ్రీ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ల బదిలీ జరిగింది. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ బి.వెంకన్న కొత్తగూడెం ఎస్ఆర్ఏఎస్ కళాశాలకు, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌ను ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలకు కేటాయించారు. అలాగే, మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ పి.రఘునందన్‌ను ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు కేటాయించారు.

మార్కెట్ ఉద్యోగులు..

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్లలోని గ్రేడ్–2 కార్యదర్శులను బదిలీ చేస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి పేరిట ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఖమ్మం మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శి బి.బజార్‌ను ఏన్కూరుకు, ఏన్కూరులో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును చర్ల మార్కెట్‌కు బదిలీ చేశారు. అలాగే, హుస్నాబాద్ మార్కెట్ నుంచి వి.సృజన్‌బాబు ఖమ్మం మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శిగా రానున్నారు.

దేవాదాయ శాఖ ఏసీ నల్లగొండకు..

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన నల్లగొండ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆమె పోస్టింగ్ నల్లగొండ జిల్లా చెరవుగట్టు దేవస్థానం ఈఓ అయినప్పటికీ ఖమ్మం ఏసీగా విధులు నిర్వర్తించారు. ఆమెను ప్రస్తుతం నల్లగొండను బదిలీ చేసినా కొత్తగా ఎవరినీ కేటాయించలేదు.

క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో సీట్ల భర్తీకి బుధవారం మూడో విడత స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో జరిగిన కౌన్సెలింగ్‌ను ఆర్‌సీఓ నాగార్జునరావు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విభాగంలో 72 సీట్లకు పది, బాలుర విభాగంలో 286 సీట్లకు గాను ఏడు సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ప్రిన్సిపాళ్లు జాన్‌నాయక్, పద్మావతి, హరికృష్ణ, భాస్కరరావు, రాణి, రమేష్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని నీటి విడుదల



ప్రాజెక్ట్ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి వరద నీరు వచ్చి కిన్నెరసాని జలాశయంలో చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 2వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, బుధవారం నీటిమట్టం 403 అడుగులుగా నమోదైంది. దీంతో ప్రాజెక్ట్‌కు చెందిన ఒక గేటు ఎత్తివేసి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్షలు

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం జరిగిన పరీక్షకు 130 మందికి గాను 113 మంది, మధ్యాహ్నం 130 మందికి గాను 117 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, ఓ మహిళ తన చిన్నారి కూతురుతో పరీక్ష రాసేందుకు రాగా, కేంద్రంలోకి వెళ్లే ముందు భర్తకు అప్పగించింది. తండ్రి ఎత్తుకున్నా.. చిన్నారి గుక్కపట్టి ఏడ్వడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై రూసీ చిన్నారిని ఎత్తుకుని లాలించారు.

ఎస్‌డీసీలో ఏడుగురు బదిలీ

పాల్వంచరూరల్ : పాల్వంచలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారిని బుధవారం ఘనంగా సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ సునిత ఎల్జిబెత్ భద్రాచలానికి, సీనియర్ అసిస్టెంట్లు భద్రు ములకలపల్లి ఆర్‌ఐగా, దేశ్‌పాండే జూలూరుపాడుకు, శివకృష్ణ లక్ష్మీదేవిపల్లి ఆర్ ఐగా, జనార్దన్ మహబూబాబాద్‌కు, గుండు రాజు భద్రాచలం ఆర్‌ఐగా, కె.సత్యావతి ములకలపల్లి ఆర్‌ఐగా బదిలీ అయ్యారు.

విధుల్లో చేరిన డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి(డీవైఎస్‌ఓ)గా బుధవారం పి.పరంధామరెడ్డి విధుల్లో చేరారు. గత జూన్ 5వ తేదీ నుంచి జూలై 30 వరకు లాంగ్ లీవ్‌లో ఉన్న ఆయన తిరిగి విధుల్లో చేరారు. కాగా ఇప్పటివరకు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కె.సంజీవరావు ఇన్‌చార్జి డీవైఎస్‌వోగా వ్యవహరించారు.

హోంగార్డును పరామర్శించిన డీఎస్పీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ తల్లి బుధవారం మృతి చెందారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ట్రాఫిక్ ఎస్సై నరేష్ మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. సురేష్‌ను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

బెల్లం ఆటో స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: నిషేధిత బెల్లం అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాలీ ఆటోను ఎక్సైజ్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి కుక్కునూరుకు బెల్లాన్ని అక్రమంగా తరలిస్తుండగా అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం గ్రామం వద్ద గుర్తించి పట్టుకున్నారు. ఆటో ట్రాలీ నుంచి రూ.1.30 లక్షల విలువైన 3,050 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ట్రాలీ ఆటో, బెల్లాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామం వద్ద ఐదున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యంను అశ్వాపురం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మణుగూరుకు చెందిన షేక్ బాబు మణుగూరు నుంచి ఆటోలో బియ్యం చింతూరు తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

కలగానే క్రమబద్ధీకరణ

- రెగ్యులరైజేషన్‌కు సెకండ్ ఏఎన్‌ఎంల ఎదురుచూపులు
- ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే విధులు
- ప్రస్తుత ప్రభుత్వమైనా రెగ్యులరైజేషన్ వేయాలని వేడుకోలు



అనంతారం హెల్త్ సబ్ సెంటర్

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలకంగా పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. వీరు కాంట్రాక్ట్ పద్ధతిలో 16 ఏళ్లుగా పని చేస్తున్నారు. ప్రజలకు జ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, అంటు వ్యాధులు ప్రబలి సరైన వైద్యం అందకపోవడం, వైద్య సిబ్బంది కొరతతో సతమతమవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద 2008 సంవత్సరంలో సెకండ్ ఏఎన్‌ఎంలను నియమించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 300 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. నియామక సమయంలో వేతనం రూ.4,200 ఇవ్వగా, ప్రస్తుతం వేతనం రూ.27,700 చెల్లిస్తున్నారు. రెగ్యులర్ ఏఎన్‌ఎంలు చేసే పనులన్నింటినీ తాము చేస్తున్నామని, కానీ తమకు పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని సెకండ్ ఏఎన్‌ఎంలు వాపోతున్నారు. తక్కువ జీతంతో, ఉద్యోగ భద్రతలేక అవస్థ పడుతున్నారు. ఇప్పటికే కొందరు వృద్ధాప్య దశకు చేరుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జూలై 26, 2023న ఏఎన్‌ఎంల భర్తీ కోసం మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ నోటిఫికేషన్ జారీ చేయగా, సెకండ్ ఏఎన్‌ఎంలు ఆందోళన బాటపట్టారు. సెకండ్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కానీ గత ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సెకండ్ ఏఎన్‌ఎంలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలకపాత్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలు అమలులో ఏఎన్‌ఎంలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ-సంజీవని, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఎన్‌సీడీ, పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం, హెచ్‌ఐవీ బాధితులకు మందుల పంపిణీ వంటి విధులు నిర్వర్తిస్తున్నారు. కరోనా సమయంలో కూడా ప్రాణాలు పణంగా పెట్టి వైద్య సేవలందించారు. విలేజ్ హెల్త్ రికార్డ్(వీహెచ్‌ఆర్), ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్(ఐహెచ్‌ఐపీ), న్యూట్రిషన్ కిట్లు, కంటి వెలుగు, హెల్త్ మిషన్ ఇన్ఫర్మేషన్ సిస్టం, గర్భిణుల నమోదు, చిన్నపిల్లల టీకాలు, బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడినవారికి, హెల్త్ క్యాంపుల్లో సేవలందిస్తున్నారు. వారానికి రెండు సార్లు హెల్త్ సబ్ సెంటర్ పరిధిలో రోగాలతో బాధపడే గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం, సీజనల్ జ్వరాల సమయంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే, హాస్టళ్లు, పాఠశాలల సందర్శన, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే ప్రోగ్రాం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మారుమూల గ్రామాలకు కూడా వెళ్లి ఆరోగ్య సేవలందిస్తున్నారు.

పని ఎక్కువ.. జీతం తక్కువ



మాకు పని ఎక్కువ. కానీ జీతం తక్కువ ఇస్తున్నారు. ప్రభుత్వం మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి. ఇన్సూరెన్స్ కల్పించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే నష్టపరిహారం కూడా అందించాలి.

– బానోత్ పార్వతి, సెకండ్ ఏఎన్‌ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

శ్రమకు తగ్గ ఫలితం లేదు



శ్రమకు తగ్గ ఫలితం లేదు. మా ఉద్యోగానికి సరైన భద్రత లేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. కొత్త ప్రభుత్వమైనా రెగ్యులరైజేషన్ కలను నెరవేర్చాలి.

– ముక్తి సావిత్రి, సెకండ్ ఏఎన్‌ఎం, అనంతారం హెల్త్ సబ్ సెంటర్

విద్యార్థిని అదృశ్యం.. ఆచూకీ లభ్యం

అశ్వారావుపేటరూరల్: ఐటీడీఏ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని బుధవారం ఉదయం అదృశ్యం కాగా, మధ్యాహ్నానికి ఆచూకీ లభ్యమైంది. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని అటెండర్స్ కాలనీ ఆశ్రమ పాఠశాలలో నారంవారిగూడేనికి చెందిన ఓ విద్యార్థిని(11) ఆరో తరగతి చదువుతోంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత పాఠశాల గోడ దూకి బయటకు వెళ్లగా, తరగతి గదిలో ఉపాధ్యాయుడు హాజరు వేసే క్రమంలో సదరు విద్యార్థిని గైర్హాజరైనట్లు గుమనించారు. దీంతో తోటి విద్యార్థులంతా కలిసి ఆశ్రమ పాఠశాల ఆవరణ, చుట్టు పక్కల గాలించగా ఆచూకీ లభ్యం కాలేదు. మధ్యాహ్నం సమయంలో విద్యార్థి స్కూల్ బ్యాగు జామెంట్రి బాక్సులో ఉన్న లేఖను తోటి విద్యార్థులు గుర్తించి ఉపాధ్యాయులకు అందించారు. ఆ లేఖలోను తాను ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నట్లు రాసింది. దీంతో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా, విద్యార్థిని అమ్మమ్మ ఇంటి వద్ద క్షేమంగా ఉన్నట్లు తెలుసుకుని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్న విద్యార్థిని ఆశ్రమ పాఠశాల టీచర్లు తీసుకొచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. విద్యార్థిని విచారించిన పోలీసులు అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సూర్యచంద్రరావు (ఫైల్)

దమ్మపేట: పామాయిల్ క్షేత్రంలో గెలలు కోసే క్రమంలో బుధవారం ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని తాడేపల్లి గూడెం తాలూకా నీలాద్రిపురం గ్రామానికి చెందిన చిట్టేటి సూర్యచంద్రరావు (39) కొన్నేళ్ల క్రితం దమ్మపేట గ్రామానికి చెందిన వరలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. అదే గ్రామంలో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. గ్రామంలోని ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూనే, ఆ రైతుకు సంబంధించిన వ్యవసాయ పనులు కూడా చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం దమ్మపేట అర్బన్‌కాలనీ శివారులో రైతు పామాయిల్ తోటలో గెలలు కోసేందుకు సూర్యచంద్రరావు వెళ్లాడు. ఎత్తులో ఉన్న పామాయిల్ గెలలను పొడవాటి లోహపు గొట్టానికి అమర్చిన కత్తితో కోస్తుండగా.. ఆ గొట్టం చెట్టుపై నుండి వెళ్తున్న విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహం వద్ద భార్య రోదిస్తున్న పలువురి హృదయాలను కలిచివేసంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

టేకులపల్లిలో మరొకరు..



భూక్య శ్రీను మృతదేహం

టేకులపల్లి: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ఎస్‌ఐ పోగుల సురేష్, విద్యుత్ ఏఈ బుజ్జి కన్నయ్య కథనం ప్రకారం.. మండలంలోని బిల్లుడుతండా గ్రామంలో బుధవారం రాత్రి సమయంలో ఓ కిరాణం షాపు వద్ద కొందరు కూర్చుని సరదాగా మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన అజ్మీర వీరన్న తన ఇంటికి విద్యుత్ సరఫరా కోసం ఎలాంటి అనుమతులు లేకుండా సర్వీస్ వైరుని మెయిన్ లైన్ (11కేవీ) విద్యుత్ తీగలపై వేశాడు. రెండు తీగలకు తగిలి నిప్పు రవ్వలు చెలరేగి 11 కేవీ విద్యుత్ తీగ తెగి కింద ఉన్న భూక్య శ్రీను(38), తేజావత్ మోతీలాల్, ఐదేళ్ళ బాలుడు భూక్య చిన్నులపై పడింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా భూక్య శ్రీను మృతి చెందాడు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతుడికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ సురేష్, ఏఈ బుజ్జికన్నయ్య సందర్శించి విచారణ నిర్వహించారు. ప్రమాదానికి కారకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ఏఈ తెలిపారు.

గుండెపోటుతో రేషన్ డీలర్...



టిక్యాలాల్(ఫైల్)

సుజాతనగర్: గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన లావుడ్యా టిక్యాలాల్(72) నలభై ఏళ్ళుగా రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం జ్వరం తగ్గగా, తిరిగి ఇంటికి రావాలనుకుంటున్న క్రమంలో గుండెపోటు వచ్చింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రంగమ్మ, కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

పాము కాటుతో మహిళ...

టేకులపల్లి: పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సంపత్ నగర్ గ్రామానికి చెందిన మల్లికంటి అమృతమ్మ (52) మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో తాచుపాము కాటువేసింది. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకన్న ఉన్నాడు.

సింగరేణి కార్మికుడికి విద్యుదాఘాతం

మణుగూరు ఓసీ–4 క్రషర్ వద్ద ఘటన

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలో బుధవారం ఓసీ–4 కార్మికుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఓసీ–4 క్రషర్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న జనరల్‌మజ్దూర్ వాంకుడోత్ నాగేంద్రబాబుకు లైటింగ్ పవర్ కేబుల్ తగిలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఒక్కసారిగా కిందపడిపోయిన నాగేంద్రబాబు కుడి చేతికి గాయాలయ్యాయి. సమీపంలో ఎవరూ లేకపోవడంతో పాకుతూ వెళ్లి సీటీపీ సిబ్బందికి విషయం తెలిపాడు. దీంతో తోటి కార్మికులు వచ్చి క్షతగాత్రుడిని అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కార్మికుడిని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ పరామర్శించారు. కాగా మెరుగైన వైద్యం కోసం నాగేంద్రబాబును కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రికి తరలించారు.



నాగేంద్రబాబును పరామర్శిస్తున్న టీబీజీకేఎస్ నాయకుడు

అత్యాచారం కేసులో ముగ్గురికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులకు బుధవారం జీవితఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు.. మణుగూరు పట్టణానికి చెందిన మైనర్ బాలిక కిరాణ కొట్టుకు వెళ్లగా, మణుగూరులోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి బాలికను బైక్‌పై ఎక్కించుకుని రోడ్డు పక్కన ఉన్న అడవిలోకి తీసుకువెళ్లాడు. మరో ఇద్దరితో కలిసి బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక చెప్పిన వివరాల ప్రకారం డేగల యశ్వంత్, నిట్ట ప్రశాంత్, సిద్ది నరేష్‌లుగా గుర్తించి బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి 17 మంది సాక్షులను విచారించారు. ముగ్గురు వ్యక్తులు నేరానికి పాల్పడినట్లు రుజువు కావడంతో న్యాయమూర్తి పాటిల్ వసంత్ పైవిధంగా తీర్పు చెప్పారు. బాలిక పేరు మీద జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా రూ. 5 లక్షలు డిపాజిట్ చేయాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్ వాదించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.అశోక్, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్‌కే ఘని సహకరించారు.

చీటింగ్ కేసు కొట్టివేత

భద్రాచలంఅర్బన్: 2016వ సంవత్సరంలో బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన చీటింగ్ కేసుకు సంబంధించి నేరం రుజువు కాకపోవడంతో బుధవారం భద్రాచలం జ్యుడీషియల్ కోర్టులో కేసు కొట్టివేశారు. సారపాకకు చెందిన పఠాన్ ఖాజాబీ, మహ్మద్ రహీమ్, పడిగే రాజేందర్‌రెడ్డిలపై బూర్గంపాడు పోలీసులు సెక్షన్ 420, మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తున్నట్లు భద్రాచలం జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. న్యాయవాది రావి రామ్మోహనరావు వాదనలు వినిపించారు.

యువకుడి ఆత్మహత్య

మణుగూరు టౌన్: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. కార్నిక శేఖర్(29) వివాహం జరగకపోవడంతో కొంతకాలంగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతూ కాలం వెల్లదీస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో 29న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మణుగూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డు ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థిని కటకం ఆశ్రిత బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రి వైద్యుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం మారేడుబాక గ్రామానికి చెందిన నరసింహారావు కూతురు పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కూతురును చూసేందుకు తల్లి గోపమ్మ రాగా, వారి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో క్షణికావేశంలో విద్యార్థిని బ్లేడ్‌తో ఎడమ చేతిని, గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. స్నేహితులు గమనించి హాస్టల్ నిర్వాహకులకు తెలుపగా, వారు విద్యార్థినిని ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య యత్నం చేసుకున్న క్రమంలో విద్యార్థినికి ఫిట్స్ వచ్చాయని, ప్రస్తుతానికి ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలో రెండు రోజులపాటు తనిఖీలు నిర్వహించి, 10 కిలోల గంజాయి, 141 లీటర్ల నిషేధిత నాటుసారా పట్టుకున్నారు. ఆటో, మూడు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లతోపాటు 8 మంది నిందితులను అదుపులోకి తీసుకుని ఐదు కేసులు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గంజాయి డొంకరాయి నుంచి కొత్తగూడెం తరలిస్తుండగా భద్రాచలం వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌లో మెరుగైన సేవలు

సంస్థ ఏజీఎం సుభాష్



ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: బీఎస్‌ఎన్‌ఎల్‌ను ఆదరించాలని ఆ సంస్థ ఏజీఎం జి.సుభాష్ కోరారు. బుధవారం కొత్తగూడెంలో ఉద్యోగులు, సిబ్బంది ప్లకార్డులు చేబూని బైక్ ర్యాలీ నిర్వహించారు. వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీ కొత్తగూడెం బీఎస్‌ఎన్‌ఎల్ డీఈ కార్యాలయం నుంచి సెంట్రల్ పార్క్ వరకు, తిరిగి విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డు వరకు కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏజీఎం మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్ తిరిగి పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగానికి ధీటుగా వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రైవేట్ రంగంలోని వివిధ రకాల నెట్వర్క్ సంస్థలు టారిఫ్ ప్లాన్స్‌ను అమాంతం పెంచడంతో వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ వైపు వస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో సిగ్నల్స్, ఇంటర్నెట్ స్పీడ్, సర్వీస్‌లు అందుబాటులో ఉన్నాయని, నెలరోజుల నుంచి నిర్వహిస్తున్న ఫ్రీ సిమ్ మేళాకు అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. 4జీ సిమ్ కార్డును ఉచితంగా అందజేసి వారుకోరుకున్న టారిఫ్ రీఛార్జ్‌కే చెల్లింపులు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు బానోత్ సక్రు, మదన్‌గోపాల్, శివరాంజీ, షకీల్, గోపి రాజేష్, అజయ్, లాలునాయక్, అశోక్, రామరాజు, సందీప్, గణేష్, నరేష్, అంకిత్, రమేష్, నీరజ, సైదులు, జేఈలు నూర్ మహమ్మద్, జైపాల్ రెడ్డి, మాన్ సింగ్, ఆశీర్వాదం, టెక్నీషియన్లు నిరంజన్, రాంకుమార్, నారాయణ, వెంకటేశ్వర్లు, సుజాత, సీత, రిటైర్డ్ ఉద్యోగులు రమేష్, శ్రీనివాస్, మజీద్, విక్టర్, డేనియల్, జాన్సన్ పాల్గొన్నారు.

రూ. 108కే 28 రోజుల ప్లాన్

బీఎస్‌ఎన్‌ఎల్‌లో కేవలం రూ.108కే 28 రోజుల పాటు అన్ లిమిటెడ్ మొబైల్ కాల్స్, రోజూ 1జీబీ డేటా, 100 ఉచిత ఎస్‌ఎంఎస్‌లు, రూ.249కే 45 రోజులపాటు అన్ లిమిటెడ్ మొబైల్ కాల్స్, రోజూ 2జీబీ డేటా, 100 ఎస్‌ఎంఎస్‌లతో ఆఫర్లు ఇస్తున్నట్లు ఏజీఎం తెలిపారు.

పర్మిట్ ముసుగులో ఫర్నీచర్ వ్యాపారం



గోదాం వద్ద వేచి ఉన్న అటవీశాఖ అధికారులు

జూలూరుపాడు: జూలూరుపాడులోని వెంగన్నపాలేనికి చెందిన ఓ వ్యక్తి పర్మిట్ ముసుగులో అక్రమంగా ఫర్నీచర్ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. ఓ వ్యక్తి తన పొలంలో టేకు చెట్లను అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా నరికించి కలపను దాచిపెట్టాడు. దీంతో అటవీశాఖ అధికారులు మూడేళ్ల క్రితం టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అటవీశాఖకు జరిమానా కట్టి రిలీజ్ చేయించుకున్న ఆ వ్యక్తి జూలూరుపాడులోని గోదాములో భద్రపరిచాడు. కాగా సదరు వ్యక్తి పర్మిట్ కలప అని చెబుతూ అక్రమంగా కలప తెప్పించి ఫర్నీచర్ తయారుచేయించి విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మంగళవారం గోదాం వద్దకు వెళ్లిన అటవీశాఖ అధికారులు టేకు కలప, హ్యాండ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అక్కడ పనిచేస్తున్న వర్కర్‌ను ఆరా తీయగా వివరాలు తెలియదని, గోదాం తాళాలు లేవని చెప్పాడు. దీంతో అటవీశాఖ అధికారులు బుధవారం కూడా వెళ్లగా, గోదాం తాళం వేసే ఉంది. దీంతో రెండు గంటలపాటు వేచి చూసి వెనుదిరిగిపోయారు. ఈ విషయంపై జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావును వివరణ కోరగా.. తనిఖీ చేసేందుకు వెళ్తే గోదాముకు తాళాలు వేసి ఉన్నాయని, సంబంధిత వ్యక్తి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు కాంట్రాక్టర్ ఫిర్యాదు



ఫిర్యాదుదారుడు కలెక్టర్‌కు అందజేసిన ఫొటో

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీలో బినామీలతో అభివృద్ధి పనులు నిర్వహించిన మున్సిపల్, కేటీపీఎస్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కాంట్రాక్టర్ వెంకటనారాయణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీలో తాను చేసిన రూ.4 లక్షల లోపు పనులకు క్లియరెన్స్ ఇవ్వకుండా కమిషనర్, డీఈ, ఏఈ ఇబ్బందులకు గురి చేశారని, తాను మెటీరియల్ తరలించినా పనులు చేయనీయకుండా మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారని ఆరోపించారు. ఇటీవల డీఎంఎఫ్‌టీ పనులు దాదాపు రూ.30 కోట్ల బిల్లులు విడుదల చేశారని, అందుకు 2 శాతం చొప్పున కలెక్టరేట్‌లో ఇవ్వాలంటూ రూ.60 లక్షలు వసూలు చేశారని, ఆ నగదు కలెక్టర్ కార్యాలయంలో ఎవరికీ అందించారో విచారణ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయంలోనే కాంట్రాక్టర్లు కూర్చుని నగదు వసూలు చేసిన ఫొటోలను కూడా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని పురపాలకశాఖ చీఫ్ ఇంజినీర్, ఎస్పీ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై కమిషనర్ ఎ.స్వామిని వివరణ కోరగా.. కాంట్రాక్టర్ చేసిన ఫిర్యాదుకు, తమకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు.

ఆర్లపెంట పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

దమ్మపేట: విధి నిర్వహణలో అలసత్వం వహించి, విద్యార్థి మృతికి కారణమైన దమ్మపేట మండలంలోని ఆర్లపెంట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణిని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన రెండో తరగతి విద్యార్థి వరుణ్‌కుమార్ ప్రమాదవశాత్తు పాఠశాల వెనుకే ఉన్న నీటి గుంతలో పడి మృతి చెందాడు. దీంతో బాధ్యులపైచర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బుధవారం విచారణ జరిపిన డీఈఓ హెచ్‌ఎం సంధ్యారాణిని సస్పెండ్ చేశారు.

ఆటో బోల్తా : 10 మందికి గాయాలు

టేకులపల్లి: ఆటో అదుపు తప్పి బోల్తా పడి పది మందికి గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. మండలంలోని పాతర్లగడ్డకు చెందిన పది మంది రైతులు రుణమాఫీ గురించి తెలుసుకునేందుకు బుధవారం ఆటోలో టేకులపల్లికి బయలుదేరారు. బోడు దాటాక లాక్యాతండా వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. దీతో ఆటోలో ఉన్న వర్స భీమయ్య, మూతి వీరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. మూతి భద్రయ్య, గొగ్గెల లోబ్య, మూతి ముత్యాలు, ఇర్ప అమ్మక్క, ఇర్ప కన్నయ్య, వాగబోయిన జగ్గయ్య, లక్ష్మి, మేకల సులోచన స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. తీవ్ర గాయాలైన ఇద్దరిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ను పోలీసులు బోడు పోలీసు స్టేషన్ తీసుకెళ్లి విచారణ చేపట్టారు.